సిమెంట్ రోడ్ల ప్రారంభోత్సవం


సిమెంట్ రోడ్డు ప్రారంభిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

మాలవాని తిప్పలో నిర్మించిన సిమెంట్ రోడ్డును డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు గురువారం ప్రారంభించారు. మాలవానితిప్ప సచివాలయ పరిధిలో గోతిప్పలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అభివృద్ధి పనులకు రూ.10 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సాగిరాజు సుబ్బరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ముదుండి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మనువాదాన్ని తరిమికొట్టే వరకూ పోరు

చించినాడ సభలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి - హింసపై మహిళల పోరు యాత్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి - యలమంచిలి

దేశంలో మనువాద భావజాలాన్ని తరిమికొట్టే వరకూ పోరు సాగుతుందని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. గత నెల 28వ తేదీన విశాఖలో ప్రారంభమైన హింసపై మహిళల పోరుయాత్ర గురువారం సాయంత్రం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి చించినాడ బ్రిడ్జి మీదుగా పశ్చిమగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా మహిళా సంఘంతోపాటు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళలు జాతాకు హారతులు పట్టి, పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుండి ర్యాలీగా అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కోశాధికారి సరిపల్లి జయప్రభ అధ్యక్షతన జరిగిన సభలో ప్రభావతి మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, దేశంలో మనువాద భావజాలాన్ని అమలు చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందన్నారు. దాని ప్రభావంతో దేశంలో మహిళలు, చిన్నారులు, వృద్ధులపై రోజురోజుకీ భయంకరమైన దాడులు జరుగుతున్నాయన్నారు. ఇటీవల మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహికంగా అత్యాచారం చేసి హత్య చేశారని, ఈ సంఘటనతో ప్రపంచ దేశాల్లో మన దేశం పరువు మొత్తం బజారున పడిందన్నారు. అయినా ప్రధాని మోడీకి చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఆఖరికి ఐక్యరాజ్యసమితి కూడా జరిగిన ఘోరంపై స్పందించిందని గుర్తు చేశారు. బిజెపికి వంతు పాడే మన రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన అధినేతలు మణిపూర్ ఘాతుకాలపై కనీసం స్పందించకపోవడం మహిళలపై వారికుండే వివక్ష ఏపాటిదో తేటతెల్లం చేసిందన్నారు. ఆయా పార్టీలకు రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్పి, మహిళలు, బడుగులకు అండగా నిలిచి రక్షించే పార్టీలను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. సభ ప్రారంభానికి ముందు కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకులు స్వరూపరాణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పొగాకు పూర్ణ, సహాయ కార్యదర్శి వై.సత్యవతి, సిహెచ్.రమణ, జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ, నాయకులు సరోజిని, హైమ, సీత, బాసిన శ్యామల, శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి దూసి కళ్యాణి, మండల నాయకులు జిల్లెల్ల ప్రశాంతి, కానేటి ప్రియాంక, ఎస్.నాగమణి, ఎం.జయశ్రీ, కళాకారులు సుజాత, విజయలక్ష్మి, దుర్గ వెంకటలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

చించినాడలో జాతాకు స్వాగతం పలికి ర్యాలీగా తరలి వస్తున్న మహిళా నేతలు

మణిపూర్ మారణహోమంపై నిరసన ర్యాలీలు

తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - పాలకొల్లు

మణిపూర్‌లో మారణహోమాన్ని నిరసిస్తూ క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి సారథ్యంలో గురువారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పూలపల్లి అంబేద్కర్ భవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రోడ్ల గుండా సాగింది. ఈ ర్యాలీలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మణిపూర్‌లో మారణహోమం బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదే అని నినదించారు. కార్యక్రమంలో ఎబినేజర్, రాపాక రత్నరాజు, మహ్మద్ జానీ, షేక్ మహబూబ్, ఇస్సాక్ పాల్, పాలమూరి శామ్యూల్, కెసిహెచ్.పెద్దిరాజు, పసుపులేటి చినబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక హౌసింగ్ బోర్డు సెంటర్ నుంచి గొల్లగూడెం, ఆర్‌టిసి బస్టాండ్, తాలూకాఫీస్ సెంటర్, ఎన్‌టిఆర్ చౌక్ మీదుగా ర్యాలీ సాగింది. తొలుత జాతీయ పతాకాన్ని, శాంతి కపోతాన్ని ఎగురవేశారు. మోకాళ్లపై నిల్చొని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బిషప్ రాజేంద్ర, క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉండి: మణిపూర్ దమనకాండకు నిరసనగా క్రైస్తవ ఐక్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉండి మెయిన్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం ర్యాలీ సాగింది. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ వీరాస్వామినాయుడుకు వినతిపత్రం అందజేశారు. అధికారం కోసం బిజెపి ప్రభుత్వం అన్నదమ్ముల్లా కలిసి ఉండే కుకీ, మెయిటీల మధ్య చిచ్చురేపిందని విమర్శించారు. మతతత్వం పేరిట రాజకీయాలు చేస్తున్న బిజెపికి 2024 ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో చిట్టూరి జోషి, రంపా పౌలురాజు, వాసుపల్లి విజయ్‌కుమార్, కమతం బెనర్జీ, అందుకూరి రాజు, చిట్టూరి రత్నరాజు, ఉండ్రు ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: మణిపూర్ మారణహోమాన్ని నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంగన్వాడీలు, ఆశాలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని, హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి రాము, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

నరసాపురంలో.

సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ప్రసాదరాజు

అభివృద్ధిలో అవినీతికి అవకాశం లేదు

చీఫ్ విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎటువంటి అవినీతికి తావులేదని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం నరసాపురం 17వ వార్డులో అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు మాట్లాడుతూ తమకు కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ప్రసాదరాజు తక్షణం తాగునీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. లోఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉందని, రాత్రి సమయంలో ఫ్యాన్లు సరిగ్గా తిరగడం లేదని చెప్పడంతో ఎంఎల్ఎ స్పందించి ఎలక్ట్రికల్ ఎఇ జె.ప్రభాకర్‌రావుతో మాట్లాడారు. రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. జగనన్న సురక్షలో జిల్లా రెండో స్థానంలో నిలవగా, నరసాపురం నియోజకవర్గం రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డిఇ ఆర్.రమేష్‌బాబు, ఎఇలు వై.సునీల్‌కుమార్, ఎలక్ట్రికల్ ఎఇ జె.ప్రభాకర్‌రావు, ప్రజాప్రతినిధులు షేక్ బుల్లిమస్తాన్, భూసారపు జయప్రకాష్, కావలి నాని, గోరి సత్తిబాబు, ఏడిదికోట సత్యనారాయణ, అడిదెల శరత్, కేసరి గంగరాజు, కామన బాలసత్యనారాయణ, మావూరి సత్యనారాయణ, మార్కండేయులు, సిరి కాంతమ్మ పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే పేదలకు సంపూర్ణ న్యాయం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి పాలనలో ప్రజలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని, ప్రజల అవసరాలను తీర్చడమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని కొత్తగా మంజూరైన 1234 రైస్‌కార్డులను గురువారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కొట్టు మాట్లాడుతూ 2004కు ముందు తెలుగుదేశం హయాంలో రేషన్ కార్డు రావాలంటే చాలా కష్టంగా ఉండేదన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అర్హులందరికీ పెద్దఎత్తున కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశారన్నారు. ఎవ్వరికీ ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండానే అత్యంత పారదర్శకంగా అర్హులకు పథకాలు అందుతున్నాయన్నారు. చంద్రబాబు పాలనకు, జగనన్న పాలనకు వ్యత్యాసం చూడాలని కోరారు. జగనన్న సురక్షలో మరింత మందికి న్యాయం జరిగిందన్నారు. ఇప్పుడిస్తున్న 1234 కొత్త రైస్ కార్డులు కాకుండా మూడు వేల కార్డులకు అభ్యర్థనలు వచ్చాయని, వాటిని కూడా త్వరలోనే పరిశీలించి మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణాధ్యక్షులు గుండుబోగుల నాగు, కొమ్ముగూడెం సొసైటీ ఛైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొట్టు సత్యనారాయణ

తల్లీ బిడ్డ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం

తల్లీ బిడ్డ ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పౌష్టికాహారం అందిస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గర్భిణులు, బాలింతలకు పది రకాలతో కూడిన పౌష్టికాహారం అందించే రేషన్ ఎట్ హోమ్ కార్యక్రమాన్ని స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ప్రారంభించారు. పలువురు గర్భిణులకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. తల్లులు పండంటి బిడ్డను కనేలా ఈ పోషకాహారం దోహదపడుతుందన్నారు. ప్రసవానంతరం బాలింతలకు ఆరోగ్యం కోసం ఈ పోషకాహారాన్ని ఇస్తారన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీసరస్వతి, సూపర్‌వైజర్ దుర్గాభవాని, ఎంపిపి పి.శేషులత, దాసరి హైమావతి, మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, వైసిపి పట్టణాధ్యక్షులు గుండుబోగుల నాగు, కొలుకూరి ధర్మరాజు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలు కొనసాగించండి

అధికారులకు సిఎం జగన్ ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

వరద ప్రభావిత ప్రాంతాల్లో యథాస్థితి వచ్చే వరకూ పునరావాస శిబిరాలు, వైద్య శిబిరాలు కొనసాగించాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి సిఎం జగన్ వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వరద తగ్గి యథాస్థితికి వచ్చే వరకూ పునరావాస కేంద్రాలు, సహాయక కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు కొనసాగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బాధితులు ఇంటికెళ్లే వరకు జాగ్రత్త చూసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల నుండి తిరిగెళ్లే సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.రెండు వేలు, సింగిల్‌గా ఉన్నవారికి వెయ్యి రూపాయలు చొప్పున ఇచ్చి పంపాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎ.దుర్గేష్, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి, ఎస్‌పి, డిఆర్ఒ

మీడియాపైకి దూసుకెళ్తున్న నిర్మాత

మీడియాపై బౌన్సర్ల దాడి

నిరసనతో బేబీ చిత్ర నిర్మాత క్షమాపణ

భీమవరం రూరల్: భీమవరంలోని నటరాజ్ థియేటర్‌కు బేబీ సినిమా విజయోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ఆ చిత్ర బృందం విచ్చేసింది. ఈ వార్త కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై ఆ చిత్ర బృందానికి చెందిన బౌన్సర్లు దాడి చేశారు. ఈ ఘటనలో ప్రైమ్ 9 రిపోర్టర్ గాయాలపాలయ్యాడు. ఇదేమిటని అడిగితే చిత్ర నిర్మాత సైతం దుందుడుకుగా వ్యవహరించి దుర్భాషలాడటంతో పరిస్థితి శృతి మించింది. ఈ గందరగోళంలోనే చిత్రం యూనిట్ జువ్వలపాలెం రోడ్డులోని ఫాల్కన్ నెక్స్ హోటల్‌కు చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న విలేకరులు పోలీసులకు సమాచారం ఇచ్చి హోటల్ వద్దకు చేరి ఆందోళన చేపట్టారు. దీనికి సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.వాసుదేవరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు తదితర ప్రజాసంఘాల నాయకులు అక్కడకు చేరుకుని సంఘీభావం తెలిపారు. టూటౌన్ సిఐ గుత్తుల శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ఇరుపక్షాలతో చర్చించారు. చివరికి చిత్ర నిర్మాత మీడియాకు క్షమాపణ చెప్పడంతో ఆందోళన విరమించారు. అయితే ఈ చిత్ర బృందం పర్యటనకు పోలీసుల అనుమతులు లేకపోవడం గమనార్హం.

న్యాయవాది హత్యపై ఐలూ ధర్నా

ఏలూరు: మణిపూర్‌లో దారుణాలకు ఒడిగట్టినవారిని కఠినంగా శిక్షించాలని, విజయవాడలో న్యాయవాదిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఏలూరు నగర కమిటీ ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ మాట్లాడుతూ మణిపూర్‌లోని కొండల్లో విలువైన గ్రీన్ గ్రానైట్లను మనులను ప్రయివేటు వారికి కట్టబెట్టే కేంద్ర ప్రభుత్వ చర్యల్లో భాగంగానే కుకీలపై మెయితీల దాడులు జరుగుతున్నాయన్నారు. మే మూడో తేదీన ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసి, వారి కుటుంబానికి సంబంధించిన ఇద్దరిని చంపడం చాలా దారుణమన్నారు. ఐలు ఏలూరు కమిటీ కార్యదర్శి గద్ద విజయభాస్కర్ మాట్లాడుతూ దేశం ఆవేదన చెందేలా మణిపూర్లో మూడు నెలలపాటు దాడులు, విధ్వంసాలు సాగుతుంటే కేంద్ర ప్రభుత్వ చర్యలు బాధ్యతారహితంగా ఉన్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐలూ నాయకులు జిల్లెళ్లమూడి ప్రసాద్, పి.రాజారావు, న్యాయవాదులు ఆంజనేయులు, హెచ్.కిషోర్, జి.కుమార్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో దిశా చట్టం అమలుకు కృషి

ఏలూరు స్పోర్ట్స్: మహిళల కోసం రూపొందించిన దిశా చట్టాన్ని జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేస్తానని జిల్లా ఇన్‌ఛార్జి దిశా డిఎస్‌పి మురళీకృష్ణ తెలిపారు. ఉమ్మడి జిల్లా దిశ డిఎస్‌పిగా నియమితులైన ఆయన గురువారం జిల్లా కేంద్రం ఏలూరులోని దిశా పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. 'అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు పోక్సో కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా ఛార్జిషీట్లు అతితక్కువ సమయంలో కోర్టులో ప్రవేశపెడతామన్నారు. తద్వారా మహిళలు, బాలికలు, యువతులపై అఘాయిత్యాలు, అక్రమాలు చేయాలంటేనే ఒణుకు పుట్టేలా చేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా మహిళా చట్టాలపై గ్రామ మహిళా రక్షణ కార్యదర్శులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. కళాశాలలు ముఖ్య కూడళ్ల తదితర ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్‌తో పాటు ఆకతాయిల చర్యలను అరికడతామన్నారు. అదే విధంగా కుటుంబ తగాదా కేసుల్లో భార్యభర్తలకు తగినవిధంగా కౌన్సెలింగ్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

ధరల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

రోజురోజుకీ విపరీతంగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు విమర్శించారు. మండలంలోని కోలమూరులో గురువారం నిర్వహించిన భవిష్యత్తుకు భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోజురోజుకి నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. వీటిని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండాపోయిందని, అత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు. ఇంటింటికీ తిరుగుతూ టిడిపి అధికారంలోకి వస్తే మహిళలకు చేకూరే లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు, ఉపాధ్యక్షులు పేరిచర్ల బాలరాజు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ, నేతలు వత్సవాయి సుజాత, చెన్నంశెట్టి హరినాయుడు, జుత్తిగ శ్రీనివాస్, కిన్నెర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

ఇళ్లు నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

వేములదీవి పడమర గ్రామ పరిధిలోని గొందిమూలలో అసంపూర్తిగా ఉన్న కాలనీ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. గురువారం కాలనీ వద్ద ఆ పార్టీ కార్యకర్తలు లబ్ధిదారులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ కాలనీలో ఇళ్ల నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదన్నారు. బిల్లులు సకాలంలో రాకపోవడం, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్లే నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. అధికారులు నిర్లక్ష్యం వీడి కాలనీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల శ్రీరామచంద్రుడు, కవురు శ్రీనివాస్, తుమ్మా రాధాకృష్ణ, తుమ్మా కళ్యాణి, పూదిండి చెంచులక్ష్మి, గుబ్బల జ్యోతి, కవురు దుర్గ పాల్గొన్నారు.

నినదిస్తున్న సిపిఎం నేతలు, లబ్ధిదారులు

వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జిగా గుడాల గోపీ..!

ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ

ప్రజాశక్తి - పాలకొల్లు, వీరవాసరం

వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వీరవాసరానికి చెందిన గుడాల గోపీ నియమితులైనట్లు సమాచారం. గురువారం రాత్రి ముఖ్యమంత్రి జగన్‌తో ప్రస్తుత ఇన్‌ఛార్జి, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్‌ప్రకాష్ గోపీని వెంటబెట్టుకుని భేటీ అయ్యారు. గోపీ నియామకానికి జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. వీరితో కీలక నేతలు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ కూడా వెళ్లారు. గోపీ నియామకంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

సిఎం జగన్‌ను కలిసిన గుడాల గోపీ, కవురు శ్రీనివాస్

ఆక్వా రైతుల ఆర్తనాదాలు

సరైన ధర లేక తీవ్ర నష్టాలు
రెట్టింపైన ఫీడ్ ధర
వ్యాపార సంస్థగా మారిన ఎంపెడా
సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

'డాలర్ పంటగా భావించే ఆక్వా సాగు నేడు కష్టాల కొలిమిలో చిక్కుకొని నష్టాల వైపు పయనిస్తుంది.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, ఫీడ్ ధర ఆకాశానికి ఎగబాకడం, కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంపెడా వ్యాపార సంస్థగా మారిపోవడంతో ఆక్వా రైతులు ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. విదేశీ మారకద్రవ్యం పేరుతో రూ.లక్షల కోట్లు ఆర్జిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా సాగు చేస్తున్న రైతులను పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణం ఆక్వా (రొయ్యలు, చేపలు) రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గురువారం మీడియానుద్దేశించి ఆయన మాట్లాడారు. అష్టకష్టాలు పడి పంట పండిస్తున్న రొయ్యలు, చేపల రైతులు సరైన ధర లేక తీవ్రంగా నష్టపోతున్నరన్నారు. వంద కౌంట్ రొయ్యలు కిలో రూ.180, రూ.190కు కూడా కొనుగోలు చేసే నాధుడు లేరన్నారు. కిలో ఉత్పత్తికి రూ.200పైనే ఖర్చు అవుతున్నప్పటికీ ధర మాత్రం తక్కువగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వంద కౌంట్ ధరను రూ.240గా నిర్ణయించినప్పటికీ అమలు జరగట్లేదన్నారు. దీనిపై పట్టించుకున్న నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగుమతిదారులందరూ పాడిందే పాటగా కొనుగోలులో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఆక్వా రంగం వల్ల వేల కోట్లు విదేశీ మారక ద్రవ్యం వస్తున్నప్పటికీ ఆక్వా రైతుల కష్టాలను మాత్రం గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు నాణ్యమైన సీడ్ దొరక్క నష్టపోతుంటే, మరో వైపు ఫీడ్ చాలా రకాల్లో నాణ్యంగా ఉండడం లేదన్నారు. ఫీడ్ ధర 10 టన్నులు రూ.లక్షా 70 వేల నుండి రూ.2.40 లక్షల వరకూ పెరిగిపోయిందని, కరెంట్ సబ్సిడీ చాలామంది రైతులకు వర్తింపజేయడం లేదని అన్నారు. ప్రభుత్వం కరెంటు ఛార్జీలు కూడా ఈ మధ్యకాలంలో పెంచేసిందన్నారు. ఇన్ని ఇబ్బందులు అధిగమించి పంట పండిస్తుంటే వాటికి సరైన ధర కల్పించకపోతే ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు. ఆక్వా రైతులు సైతం ఆత్మహత్యలు చేసుకునే దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయని విమర్శించారు. తక్షణం 100 కౌంట్ ధర రూ.240 నుంచి రూ.250 వరకూ కల్పించి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారు. చేపల రైతులకూ కిలో రూ.130కు మించి ధర లభించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ఆక్వా రైతుల సమస్యలపై దృష్టి సారించి వారిని అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. ఎంపెడా కూడా తన విధానాలను మార్చుకుని రైతులను ఆదుకోవడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

డిఎన్‌ఆర్‌కు నాక్ 'ఎ' గ్రేడ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

డిఎన్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇటీవల నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) ఎ గ్రేడ్ సాధించిందని డిఎన్‌ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నరసింహారాజు మాట్లాడుతూ తమ ఇంజినీరింగ్ కళాశాల నాక్ ఎ ప్లస్ గ్రేడ్ సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగా ఈ ఉత్తమ గ్రేడును కళాశాల సాధించిందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైనన్ని మౌలిక వసతులు, ప్లేస్‌మెంట్స్ శిక్షణ, ఇతర సదుపాయాలు ఇప్పటికే కల్పించామని, విద్యార్థులకు అధునాతన సబ్జెక్టుల ఏర్పాటుకు తమ పాలకవర్గం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల ప్రిన్సిపల్, సిబ్బందిని అభినందించారు. కళాశాల పాలకవర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ తమ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు ప్రోత్సాహం, సహచర పాలకవర్గ సభ్యుల సహకారం, కళాశాల సిబ్బంది కృషి ప్రస్తుత విద్యారంగంలో ఉన్న ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, శిక్షణ, ప్లేస్‌మెంట్స్ రాజీ లేకుండా విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో నెలకొల్పిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఇప్పటి వరకూ సుమారు రెండు వేల మంది విద్యార్థులు అనేక రంగాల్లో శిక్షణ పొందారని తెలిపారు. పేద విద్యార్థులకు పలు ప్రోత్సాహకాలను అందించి వారి అభ్యున్నతికి కషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు కళాశాల సొంతం చేసుకునేలా అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.అంజన్‌కుమార్, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరసన చేసిన కెవిపిఎస్ నాయకులు

దళితపేటలో సమస్యలు పరిష్కరించాలి

కెవిపిఎస్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - పెనుమంట్ర

దళితపేటలో తక్షణం రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెనుమంట్రలోని దళితపేటలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్ మాట్లాడుతూ దళితపేటలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి వ్యవస్థ లేక దళితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షా కాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. మండల కేంద్రంలో ఉన్న దళితపేటలనే పట్టించుకోకపోతే సుదూర గ్రామాల్లో దళితపేటల్లో సమస్యలను ఎలా పట్టించుకుంటారని ప్రశ్నించారు. ఎస్‌సి కాలనీకి ఆనుకుని ఉన్న కొత్త కాలనీలో చాలామంది ఇళ్లు నిర్మించుకున్నారని, రోడ్డు సౌకర్యం సరిగ్గా లేక నిర్మాణ సామగ్రి తెచ్చేందుకు వేలకు వేలు ఖర్చుపెట్టాల్సి వస్తోందన్నారు. తక్షణం కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.జాన్, ఎన్.దుర్గారావు, కె.సురేష్ పాల్గొన్నారు.

పాలకొల్లులో 75,141 సర్టిఫికెట్లు జారీ

ప్రజాశక్తి - పాలకొల్లు

నెల రోజులుగా పాలకొల్లు నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 75,240 కుటుంబాలకు గాను 75,141 సర్టిఫికెట్లు జారీ చేసినట్లు ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ చెప్పారు. ఆయన కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పేదలకు ఉచితంగా సర్టిఫికెట్లు జారీ చేసినట్లు చెప్పారు. వాలంటీర్లు, గృహసారథులు, అధికారులు మమేకమై ప్రజలకు సర్టిఫికెట్లు జారీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, జోగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎఒ రాజేష్

పాలూరులో 'పొలంబడి'

అత్తిలి :పాలూరులో పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ రాజేష్ రైతులతో మాట్లాడారు. రైతులు యాజమాన్య పద్ధతిలో సాగు చేయడం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. పొలంబడి కార్యక్రమం ప్రతి వారమూ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ సాహిత్య, రాము, గ్రామ సర్పంచి దైవమణి, ఉప సర్పంచి సింహాచలం, ఎంపిటిసి రామలింగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న సర్పంచి మంగతాయారు

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

వ్యవస్థలోని ప్రతి వ్యక్తి బాధ్యతా తనదేనన్నట్టు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారని సర్పంచి చికిలే మంగతాయారు అన్నారు. సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం వీరవాసరంలో సర్పంచి మంగతాయారు ప్రారంభించారు. సిడిపిఒ టి.లక్ష్మీకాంతం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంగతాయారు మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకోవాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే పోషకాహారం అందించడం ప్రభుత్వానికి ప్రజల పట్ల ఉన్న బాధ్యతను తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పోషణ కిట్లు వాడుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మద్దాల వెంకటలక్ష్మి, వార్డు సభ్యులురాలు పి.కనకలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.కనకమహాలక్ష్మి, ఎఎన్‌ఎం ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ఎనలేనవి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ఎనలేనివని భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. బుధవారం రాత్రి గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో జరిగిన సమావేశానికి క్లబ్ అధ్యక్షులు చవ్వ రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన సంస్థ లయన్స్ క్లబ్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు సేవలందిస్తోందన్నారు. క్లబ్ జిల్లా నాయకులు ఈపూరి సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం గణపవరం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షులుగా రావూరి నాగరాజు, ఉపాధ్యక్షులుగా పి.నాగేశ్వరరావు, కె.నాగశేషురావు, కార్యదర్శిగా పొట్నూరి సింహాచలం, కోశాధికారిగా సత్తినీడి వెంకటేశ్వరరావు (నాని) ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో కాకరాల వేణుబాబు, దాట్ల రామరాజు, కాళ్లకూరి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు.

బాలిక అదృశ్యంపై కేసు

ఉండి:బాలిక అదృశ్యం కేసు నమోదైన ఘటన యండగండి కండ్రికగూడెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అత్తిలి మండలం గుమ్మంపాడుకు చెందిన బాలిక తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లింది. అయితే బాలిక 15 రోజుల క్రితం అమ్మమ్మ ఇంటికి వచ్చింది. జులై 29న సరుకుల నిమిత్తం కిరాణా కొట్టుకు వెళ్లింది. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో అమ్మమ్మ దాకే సావిత్రి బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల వెతికింది. ఎంత వెతికినా బాలిక ఆచూకీ దొరక్కపోవడంతో గురువారం బాలిక అమ్మమ్మ సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.గంగాధర్‌రావు తెలిపారు.

దేవాలయాల్లో చోరీకి యత్నం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల సోమేశ్వరస్వామి ఆలయం, కోలనపల్లిలోని భోగేశ్వర స్వామి ఆలయం, కాళ్లకూరులో భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయాల తలుపులు పగలగొట్టి చోరీకి ప్రయత్నించారు. గురువారం ఉదయం ఆయా ఆలయాల తలుపులు పగలగొట్టినట్లు ఉండడాన్ని గమనించిన ఆలయ పూజారులు దేవస్థానం ఇఒ దృష్టికి తీసుకెళ్లారు. కాళ్ల, కోలనపల్లి శివాలయాల ఆలయ ఇఒ కూచంపూడి శ్రీనివాసరాజు, కాలుకూరు భీమేశ్వర స్వామి ఆలయ ఇఒ అల్లూరి సత్యనారాయణరాజు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. కాళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గ్రామాలాభివృద్ధికి కృషి : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం యండగండి సచివాలయం-1 పరిధిలో పలు సీసీ రోడ్లకు పివిఎల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన ప్రతి సచివాలయానికీ అభివృద్ధి నిమిత్తం రూ.20 లక్షలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విడుదల చేస్తున్నారని తెలిపారు. ఆ నిధులు, అలాగే మండల పరిషత్తు నిధుల నుంచి రూ.17 లక్షలు కేటాయించి సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గ పూర్తిస్థాయిలో అభివృద్ధికి సహకరిస్తున్న పివిఎల్ నరసింహరాజును వచ్చే ఎన్నికల్లో ఉండి శాసనసభ్యులుగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సహోపాధ్యక్షురాలు దత్తాల సుజాతారాణి, సచివాలయ కన్వీనర్లు ప్రసంగి, వేగేశ్న వేణు, గోపాలకృష్ణమూర్తి, శివన్నారాయణ, రామరాజు, వరహాలరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

పారిశుధ్య నిర్మూలన బాధ్యత అందరిదీ

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలన బాధ్యత అందరిదీ అని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం గణపవరం పంచాయతీ వద్ద స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్థానికులకు తడి, పొడి చెత్తకు సంబంధించి డస్టు బిన్నులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి గ్రామ సర్పంచి మూరా అలంకారం అధ్యక్షత వహించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రజలకు ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి వేయాలన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. అలాగే వికలాంగులకు స్కూటీలు పంపిణీ పంపిణీ చేశారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి దండు వెంకట రామరాజు, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి. వైఎస్ ఎంపిపి సలాది రత్న దుర్గాకుమారి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి - కాళ్ల

రికార్డులు తనిఖీ చేస్తున్న సిఐ సత్యనారాయణ

ఆకివీడు సిఐ కెవివిఆర్.సత్యనారాయణ గురువారం కాళ్ల పోలీస్‌స్టేషన్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్లో క్రైమ్‌లకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన భూమి వివరాలు, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలో ఎస్ఐ ఎజిఎస్ మూర్తి, ఎఎస్ఐ రామరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సీసలిలో అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

సీసలిలోని షిరిడీ సాయిబాబా ఆలయానికి యాత్రికులు గురువారం అధిక సంఖ్యలో వచ్చారు. చంటి బిడ్డల తల్లిదండ్రులు పటిక బెల్లం, లడ్డూలు, పాలకోవాతో తులాభారం నిర్వహించి స్వామి వారి అనుగ్రహం పొందారు. అనంతరం గూట్లపాడు గ్రామానికి చెందిన జవ్వాది సాయిబాబు, అనంతలక్ష్మి దంపతులు వారి కుమారుడు జవ్వాది వంశీకృష్ణ ప్రియాంక దంపతులు, వారి అల్లుడు - కుమార్తె నూకల వెంకటరాజ్ గోపాలరావు - నాగ దీపిక దంపతులు, మనవరాలు లోచిన, మనవడు దీక్షితుల ఆర్థిక సహకారంతో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాలను ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ తోరం అనంతలక్ష్మి, సత్యవతి, దేవి పర్యవేక్షించారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అరుణ

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం

ప్రజాశక్తి - తణుకురూరల్

తల్లిపాలు బిడ్డకు రోగ నిరోధకశక్తిని ఇస్తాయని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ వి.అరుణ అన్నారు. గురువారం స్థానిక ఆసుపత్రిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ బిడ్డకు 6 నెలల వరకూ తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. దాని వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ గౌతమి, ఎస్ఎన్‌సియు భాగ్యశ్రీ పాల్గొన్నారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అప్పారావు

ప్రజాశక్తి - పాలకొల్లు

కెసిహెచ్.అప్పారావు

రాష్ట్రంలో 175 నియోజకవర్గాలకు రిటర్నింగ్ ఆఫీసర్లను నియమిస్తూ ఎన్నికల కమిషన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లకు వివిధ జిల్లాల అధికారులను రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. ఈ క్రమంలో పాలకొల్లుకు డిడిపిఒ కెసిహెచ్.అప్పారావును నియమించారు. ఆయన వెంటనే గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

విఒఎ సూర్యకుమారి అరెస్టు

మొగల్తూరు:మండల సమైఖ్యకు చెందిన స్త్రీ నిధి రుణాల వసూళ్లలో అవకతవకలు పాల్పడిన విఒఎ మద్దాల సూర్యకుమారిని గురువారం అరెస్టు చేశామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పేరుపాలెం బెల్లంకొండ వారిమెరకకు చెందిన మద్దాల సూర్యకుమారి విఒఎగా పనిచేస్తున్నారు. మండల సమాఖ్యకు చెందిన స్త్రీ నిధి నుంచి డ్వాక్రా సభ్యులకు ఇచ్చిన రుణాలు తిరిగి వసూలు చేసి మండల సమైఖ్యకు జమ చేయకుండా దుర్వినియోగం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి 14,62,176 రూపాయలు అవకతవకలు జరిగినట్లుగా నిర్ధారించారు. దీనిపై వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం మారంపూడి సుభాషిని మే 10న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. దర్యాప్తు అనంతరం నిందితురాలిని అరెస్టు చేసి కోర్టుల హాజరపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

గొల్లవానితిప్పలో మహాశక్తి చైతన్య రథయాత్ర

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో గొల్లవానితిప్పలో మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించి, స్థానిక మహిళలకు మినీ మేనిఫెస్టో కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి అంగన్‌వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే ప్రకటించిన పథకాలన్నీ అమలు చేస్తారని సభలో హామీ ఇచ్చారని తెలిపారు. తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాదాసు కనకదుర్గ మాట్లాడారు. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాశక్తి టీం సభ్యులు సయ్యద్ నసీమాబేగం, ఎండి షబీనా, బి.పద్మ, నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎంఎల్ఎను కలిసిన మున్సిపల్ కమిషనర్ శ్యామల

పట్టణంలో నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని నూతనంగా మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు చేపట్టిన ఎం.శ్యామలను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. విజయవాడ నుండి బదిలీపై భీమవరం మున్సిపాల్టీకి వచ్చిన కమిషనర్ ఎం.శ్యామల గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వర్తించి పట్టణాన్ని మరింత సుందరంగా తయారు చేయాలని ఆయన ఆదేశించారు.

పోలీస్ స్టేషన్‌కు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - కాళ్ల

పోలీస్‌స్టేషన్లో కంప్యూటర్ అవసరం గుర్తించి కంప్యూటర్‌ను బహూకరించడం అభినందనీయమని ఆకివీడు సిఐ కెవివిఆర్ సత్యనారాయణ పేర్కొన్నారు. కాళ్ల పోలీస్ స్టేషన్‌కు రూ.37 వేల విలువైన కంప్యూటర్‌ను సిఐ సత్యనారాయణకు గురువారం దళిత నాయకులు అందజేశారు. ఎస్ఐ ఇజిఎస్ మూర్తి, బహుజన రాష్ట్ర అధ్యక్షులు కుటుంబ సభ్యులు ఈ కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య, జెఎసి రాష్ట్ర కార్యదర్శి బుంగా ఆదాము, కోనా రంజిత్, కోనా రవితేజ, కొండా రాజేష్ పాల్గొన్నారు.

కక్షతోనే కౌన్సిలర్ సస్పెన్షన్ : జనసేన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వైసిపి అరాచకాలను ప్రశ్నించినందుకు పట్టణంలో 22వ వార్డుకు చెందిన జనసేన కౌన్సిలర్ భారతీ సురేష్‌ను సస్పెండ్ చేయడం సరికాదని జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఎఒకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కౌన్సిలర్ భారతీ సురేష్‌ను కక్ష్య సాధింపులో భాగంగా సస్పెండ్ చేశారని తెలిపారు. రెండేళ్లుగా అధికార పార్టీ కౌన్సిలర్లు మైకులు విసిరినా, దుర్భాషలాడినా సస్పెండ్ చేయలేదని, భారతి సురేష్ ఎస్‌టి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని, అభివృద్ధి పనులు జరగడం లేదని ప్రశ్నించినందుకు సస్పెండ్ చేశారని విమర్శించారు. కేవలం ఇది కక్ష్య సాధింపు చర్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాతాడి కనకరాజు, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, ఆకుల వెంకటస్వామి, గంటా కృష్ణ, కొల్లాటి గోపీకృష్ణ, నిప్పులేటి తారక రామారావు, గుబ్బల మార్రాజు, తోట నాని, భారతి సురేష్ పాల్గొన్నారు.

కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, నియోజకవర్గ అధ్యక్షులు మద్రి అజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వి.సాయికుమార్ అధ్యక్షతన తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.అప్పలస్వామి, మద్రి అజయ్ మాట్లాడుతూ కొంతకాలంగా గూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక విద్యార్థులు సతమతమవుతున్నారన్నారు. ఇది ప్రస్తుతం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో కొనసాగుతోందన్నారు. కళాశాలకు సొంత భవనం మంజూరు చేయాలనే డిమాండ్‌పై రానున్న రోజుల్లో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరుకు సమాయత్తం అవుతామని హెచ్చరించారు. అనంతరం 9 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అడపా ఉత్తేజ్‌కుమార్, గుంజే అశోక్, సూరి దిలీప్, డి.విజయరాజ్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి - పెనుగొండ

పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

నిడదవోలు హైస్కూల్లో పోలింగ్ బూత్‌లను గురువారం తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని తెలిపారు. అనంతరం అక్కడ వసతులను పరిశీలించారు. అనంతరం హైస్కూల్లో మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పథకం సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ ఏసుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సరళాదేవి పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ ఛైర్ పర్సన్ వావిలాల సరళాదేవి పుట్టినరోజు సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఆమె నివాసంలో కేక్ కట్‌చేసి అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొమ్మల వీధిలోని ఉచిత కుట్టు మిషన్ శిక్షణా శిబిరాన్ని సరళాదేవి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద మహిళలకు టైలరింగ్ వర్క్ ఉచితంగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే డంపింగ్ యార్డు వద్ద ఉన్న నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంబనాంబ ఆశ్రమంలోని 15 మంది మహిళలకు చీరలు, పండ్లు, భోజనాలు పంపిణీ చేశారు. అలాగే 20 మంది యువకులు రక్తదానం చేశారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ గవర్నర్ గట్టి మాణిక్యాలరావు, నైస్ నాయకులు కె.మురళి చీకటి శ్రీనివాస్, కరుటూరి శేషగిరి, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వర్తనపల్లి కాశి పాల్గొన్నారు.

కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సరళాదేవి

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No. 193-198/15th FC, GGMP Grant & General /2023-24, Dated: 02-08-2023
The Commissioner, Municipal Corporation, Eluru, invites tenders from interested, eligible bidders for **"Supply and Delivery of JCB 30, Supply of Skid Steer Loader, Construction of Multipurpose Community Hall, Repairs to various bridges, Providing Tree Guards and Supply of 2 Colours Dust Bins in Municipal Corporation, Eluru"** Total No of works is 6 with an amount of **Rs.81.61 Lakhs.**
Tender schedules are available on e-procurement market place from 04-08-2023. Last date of receipt of tenders is 10-08-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner Municipal Corporation, Eluru, Eluru District (Phone / Fax : 08812 - 245990)
Sd/- **COMMISSIONER,** Municipal Corporation, Eluru

మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

జగనన్న సురక్ష విజయవంతం

ప్రజాశక్తి - పోడూరు

జగనన్న సురక్ష ఒక వినూత్న కార్యక్రమం అని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో జగనన్న సురక్షపై ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. టిడిపి హయాంలో రెవెన్యూ సర్టిఫికెట్లు తీసుకోవాలంటే ప్రజలు ఇబ్బంది పడేవారని, వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా 11 రకాల సర్టిఫికెట్లు ఇస్తున్న మంచి పథకం అని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా ఆచంట నియోజకవర్గంలో 64 సచివాలయాల్లో 73 వేల మందిని సర్వే చేశామని, అందులో 51,500 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేశామని తెలిపారు.

శ్రీనివాస్ నియామకంపై హర్షం

ఉండి:వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షులుగా ఉండికి చెందిన శేషాద్రి శ్రీనివాస్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శేషాద్రి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని కార్మికులకు చేదోడు వాదోడుగా ఉంటూ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు. తాను ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షులుగా తన నియామకానికి సహకరించిన పివిఎల్ నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

పాల సత్యనారాయణ, తండ్రి: రామారావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. సోమరాజు చెరువు నుండి వయ కొతలపర్రు మీదుగా పెనుగొండ వస్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెంబర్: **T8565136** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

పాల సత్యనారాయణ
తండ్రి: రామరావు, సోమరాజు చెరువు,
పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా.
పిన్ : 534320
సెల్ : 96522 06119

దస్తావేజు పోయినది

నా క్లయింటు ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, కొత్తూరు గ్రామ కాపురస్తులు **చెన్నుబోయిన సుబ్బారావు గారి కుమారుడు చెన్నుబోయిన నాగబాబు** నాకిచ్చిన సంజాయిషిపై తెలియచేయునది ఏమనగా..,

నా క్లయింటు పెదపాడు మండలం, కొత్తూరు గ్రామ వాస్తవ్యులు. ది.27-07-2023వ తేదీన ఉదయం 10:00 గం॥లకు తన చ॥గ॥155-00లు స్థలములో ఉన్న ఆర్.సి.సి. డాబా ఇంటికి సంబంధించిన **దస్తావేజు 6045/2006 యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ 1104/1993ను** ఒక బ్యాగులో పెట్టుకొని కొత్తూరు నుండి ఏలూరు బైక్ మీద వెళ్తుండగా, ఏలూరు వచ్చేసరికి బైక్ సైడ్ హుక్‌కి తగిలించిన బ్యాగ్ కనపడలేదు. వచ్చిన దారి మార్గమున వెతికినను తన బ్యాగ్ కనిపించలేదు. కావున నా క్లయింటుకి సంబంధించినటువంటి దస్తావేజు 6045/2006 యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ 1104/1993పై ఎవరైనను ఏ విధమైనటువంటి లావాదేవీలు జరిపినను అవి చెల్లనేరవు. ఆ బ్యాగు ఎవరికైనను దొరికిన యెడల, మాకు తెలియపరిచిన మీకు తగిన బహుమతి ఇవ్వబడును. ఈ క్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

తిగిరిపల్లి సుబ్బారావు
అడ్వకేట్, జిల్లా పరిషత్ ఎదురుగా,
ఎన్.ఆర్.పేట, ఏలూరు.
సెల్ నెం : 94400 20815

IN THE COURT OF THE XI ADDL. CHIEF JUDGE,CITY CIVIL COURT, AT: HYDERABAD
Arb. O.P.No. 83 OF 2022

Between:
1. Boppana Venkata Pradeep Kumar, S/o. Bapineedu Chowdary, Aged about 60 years, Business, R/o. D.No. 59A, 16-3/1, Plot No. 116, 3 rd Cross Road, RTC Colony, Patamata, Venkateswarapuram, Vijayawada, Krishna District-520010.
2. Nimmagadda Prakasha Rao, S/o. Chalapathi Rao, Aged 58 years, Business, R/o. 40-12-5/9, 2/5, Ram Mohana Residency, Patamata Lanka, Venkateswarapuram Colony, Vijayawada, Krishna District-520010.
...Petitioners
AND
1. M/s. Shriram City Union Finance Ltd., Having its Reg. Office at Chennai & Administrative Office at 3-6-478, 4 th Floor, Anand Estates, Liberty Road, Himayath Nagar, Hyderabad. Branch Office at Vijayawada, Rep. by its GPA K. Phani Kumar Venkateswara Rao, (died on 18-04-2018 per LR B. Bala Tripura Sundari)
2. B. Bala Tripura Sundari, W/o. Venkateswara Rao, Aged 50 years, Household, Presently R/o. Ground Floor, Sunrise Apartments, Chebrole Road, Opp. Allite College, Dubacherla, W.G.Dist., A.P.-520007.
3. Sri. T. Sundara Ramaiah, Arbitrator, Office at 1-1-300/B, 1 st Floor, Ashok Nagar to Himayathnagar main Road, Above Canara Bank, Ashok Nagar, Hyderabad.
...Respondents

To,
R-2: B. Bala Tripura Sundari, W/o. Venkateswara Rao, Aged 50 years, Household, Presently R/o. Ground Floor, Sunrise Apartments, Chebrole Road, Opp. Allite College, Dubacherla, W.G.Dist., A.P.-520007.

NOTICE
The above named Petitioners filed the above Arbitration O.P.No. 83 of 2022 for seeking for setting aside the Award dated 16-12-2021 Passed in ARC No. 217 of 2021 passed by the 3 rd Respondent herein. The Hon'ble Court ordered Notice to you by publication. Please take notice that the above case is posted to 13-09-2023 and you have to appear before the Hon'ble Court by 10.30 am on that day either in person or through your counsel else the same will be decided in your absence.
(BY ORDER OF THE COURT)
P. VIJAYA LAKSHMI, Advocate,
1-58/KN/249, Krushi Nagar, Miyapur,
Hyderabad-500049.